


# యేసు ఎవరు?

# యేసు ఎవరు?

యేసు క్రీస్తు ఒక మంచి వ్యక్తి, మంచి బోధకుడు మరియు గొప్ప ప్రవక్త అని కొంత మంది చెబుతారు; కాని ఆయన దేవుని కుమారుడు – శరీరము దాల్చిన దేవుడు అని మరి కొంతమంది చెబుతారు.

మీరేమనుకుంటున్నారు?

యేసు జీవితం యొక్క ఉద్దేశము ఏమిటి?

ఇది తెలుసుకోడం నా జీవితానికి ఎందుకు కీలకం?

ఈ ప్రశ్నలకు సమాధానము చెప్పుట కొరకు, బైబిల్ ఏమి చెబుతున్నదో మన కొరకు చూచుటకు కొన్ని లేఖనములను మనము పరిశోధించవలసిన వారమైయున్నాము. మన యొక్క పఠనమును ప్రారంభిద్దాం:

"ఏలయనగా మనమింక బలహీనులమైయుండగా, క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతి మంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివాని కొరకు ఎవడైన ఒక వేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమైయుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడినయెడల సమాధాన పరచబడినవారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము"[1]

"…. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు"[2] (దేవుని మహిమయొక్క ప్రామాణికతను అందుకోలేకపోయారు).

పై వచనములు సకల మానవాళిని గూర్చి కొన్ని సంగతులు చెప్పాయి. అవి చెప్పిన ప్రకారం మనమందరము:

- బలహీనులం
- భక్తిహీనులం
- దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేని పాపులం
- దేవునికి శత్రువులం (మన పాప స్వభామును బట్టి)
- ఆయన కుమారుని విశ్వసించకపోతే దేవుని ఉగ్రతను పొందుకోబోయే వాళ్ళం.

పై లేఖనములు ఇంకా చెబుతున్నవి

- క్రీస్తు భక్తిహీనుల కొరకు చనిపోయెను (మనందరి కొరకు)
- మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. అలాగున దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచెను.
- క్రీస్తు రక్తము చేత మనము నీతిమంతులముగా తీర్చబడ్డాము (నీతిగా చేయబడ్డాము, పూర్తిగా కడుగబడ్డాము).
- క్రీస్తు ద్వారా రాబోవు ఉగ్రత నుండి మనము రక్షింపబడ్డాము.
- క్రీస్తు మరణము ద్వారా మనము సమాధాన పరచబడ్డాము (దేవుని అనుగ్రహం పొందాం).
- క్రీస్తు జీవించుట చేత మనము రక్షింపబడతాము.

మరింత స్పష్టత పొందుటకు ఇంకా చదువుదాం:

"మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను (శుభవార్త) మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనేగాని, నేను ఏ ఉపదేశ రూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనియున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు. నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను"[3]

సువార్త అనగా శుభవార్త. పై లేఖనముల ప్రకారము శుభవార్త అనగా ఏమిటి?

- లేఖనముల ప్రకారం క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందాడు.
- క్రీస్తు సమాధి చేయబడ్డాడు.
- లేఖనముల ప్రకారం క్రీస్తు మూడవ దినమున లేపబడెను (తిరిగి బ్రతికెను)

అవి మనకు ఇంకా అవసరమైనవి కూడా చెప్పాయి.

- ఈ శుభవార్తను అంగీకరించండి మరియు విశ్వసించండి.
- ఈ శుభవార్తను పట్టుకొని దానియందు నిలచియుండవలసిన అవసరము మనకున్నది.
- ఈ శుభవార్త ద్వారానే మనము రక్షింపబడ్డాము.

## ఈ క్రింది లేఖనములతో ముగిద్దాం:

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా (యేసు క్రీస్తు) పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను (యేసు క్రీస్తు) అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడు ఆయనను (యేసు క్రీస్తు) లోకములోనికి పంపలేదు. ఆయన యందు విశ్వాసముంచు వానికి తీర్పు తీర్చబడదు. విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచలేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను"[4]

"…. మనుష్య కుమారుడు (యేసు క్రీస్తు) పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా (వెల చెల్లించి కొన్నాడు) తన (యేసు క్రీస్తు) ప్రాణము నిచ్చుటకు వచ్చెను"[5]

"తన్ను (యేసు క్రీస్తు) ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన (యేసు క్రీస్తు) నామమునందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన (దేవుడు) అధికారము అనుగ్రహించెను"[6]



దేవుని కుమారుడైన యేసు క్రీస్తును గూర్చి లేఖనములు ఏమి చెప్పుచున్నవి?

## అవి చెబుతున్నాయి.

- దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను మరియు ఆయన తన అద్వితీయ కుమారుని (యేసు క్రీస్తు) అనుగ్రహించెను.
- దేవుని కుమారుని యందు విశ్వాసముంచితే, మనము నశించిపోము (దేవుని ఉగ్రతను ఎదుర్కోవడం) కాని మనము నిత్య జీవమును పొందుకుంటాము.
- లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడు యేసు క్రీస్తును పంపలేదు కాని లోకము ఆయన ద్వారా రక్షణ పొందుటకే పంపెను.
- మనము యేసునందు విశ్వాసముంచితే, మనకు తీర్పు తీర్చబడదు.
- మన పాపముల నిమిత్తము విమోచన క్రయధనముగా క్రీస్తు తన ప్రాణము నిచ్చెను; మరొక మాటలో చెప్పాలంటే వెల చెల్లించి క్రీస్తు మనలను కొన్నాడు.
- చివరిగా, దేవుని పిల్లలగుటకు, మనము యేసును అంగీకరించి విశ్వసించవలసిన వారమై యున్నాము.

| | |
|---|---|
| [1] రోమా 5:6-10 | [4] యోహాను 3:16-18 |
| [2] రోమా 3:23 | [5] మత్తయి 20:28 |
| [3] 1 కొరింథీ 15:1-4 | [6] యోహాను 1:12 |

*(ప్రైవేట్ సర్క్యులేషన్ కొరకు మాత్రమే)*

ఇంకా వివరములకొరకు సంప్రతించండి:
whoisjesus008@gmail.com

Telugu